








www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

శనివారం | 07 | నవంబర్ | 2026 | పేజీలు: 08

అక్షిత అక్షర పోరు

ఆక్రమణలపై కదలిక!

పొదలకుంటలో 21 నిర్మాణాల గుర్తింపు..!!

ఇక కూల్చివేతలెప్పుడు?

అక్షిత తెలుగు దినపత్రికఎఫెక్ట్.. కదలిన అధికార యంత్రాంగం!

సర్వే నంబర్ 389లో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల క్షేత్రస్థాయి సర్వే

గతంలోనే ఇరిగేషన్ శాఖ నోటీసులు

తాజాగా 21 నిర్మాణాల గుర్తింపు

సర్వేలు, నోటీసులతో సరిపెడతారా? ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటారా?

పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి : ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల పరిరక్షణ కోసం పత్రికలు చేసే అక్షర పోరాటం అధికార యంత్రాంగాన్ని కదిలిస్తే అంతకంటే సంతోషకరమైన విషయం మరొకటి ఉండదు.సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 389లో ఉన్న పొదలకుంట ఆక్రమణల వ్యవహారంలో అక్షిత తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనం అధికారుల దృష్టిని ఆకర్షించింది. అక్టోబర్ 22న 'పొదలకుంటపై మౌనమేల..?' అనే శీర్షికతో ప్రచురించిన ప్రత్యేక కథనం అనంతరం తాజాగా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

అక్షిత కథనంతో కదిలిన యంత్రాంగం!

పొదలకుంట పరిధిలో ఆక్రమణలు, నిర్మాణాలపై గతంలోనే అక్షిత దినపత్రిక పలు ప్రశ్నలు సంధించింది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారాలతో వెలుగులోకి తెచ్చింది. చెరువు హద్దులు ఎక్కడ? నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ఆక్రమణలపై ..మిగతా 2లో



మహా పాదయాత్రకు నేనే వస్తా

కరీంనగర్ కాషాయ జోష్ చూస్తా

కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో నితిన్ నబీ



కరీంనగర్, అక్షిత బ్యూరో : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొడుతూ సర్ విషయంలో వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కరీంనగర్ లో చేపడుతున్న 'మహా పాదయాత్ర'కు తానే స్వయంగా వస్తానని ఈ సందర్భంగా బండి సంజయ్ కు నితిన్ నబీ చెప్పారు.వాస్తవానికి ఈనెల 5న కరీంనగర్ రావాల్సి ఉన్నప్పటికీ, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున రాలేకపోయానన్నారు. ఈసారి 'చట్ పూజ' అనంతరం తప్పకుండా కరీంనగర్ వచ్చి ..మిగతా 2లో

వైద్య, ఆరోగ్య సేవల్లో

రాజీ ప్రసక్తే లేదు

తుంగతుర్తి దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.1000 కోట్లు తీసుకొస్తా

సూర్యాపేటలో రూ.190 కోట్లతో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

2



మహా పాదయాత్రకు నేనే వస్తా



మొదటి పేజీ తరువాయి...

మహా పాదయాత్రలో పాల్గొంటానని చెప్పారు. కరీంనగర్ లో కాషాయ శ్రేణుల జోష్ ను చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా నితిన్ నబిన్ బండి సంజయ్ తో చర్చించారు.

ఎకో ఫ్రెండ్లీ దీపావళి వర్క్ షాప్



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్), మహబూబ్ నగర్ శుక్రవారం నాడు వృక్షశాస్త్ర విభాగానికి చెందిన ఎకో క్లబ్ ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకొని ఎకో ఫ్రెండ్లీ దీపావళి అనే అంశం పైన వర్క్ షాప్ ను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన విద్యార్థినిలు బంకమన్ను, గోధుమపిండి, నారింజపండు ,నిమ్మ పండు తొక్కలు మరియు ఉసిరి ఫలాలతో తయారుచేసిన ప్రమిదలను ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రమిదలు పర్యావరణానికి అనుకూలంగా మరియు కాలుష్య రహితంగా ఉంటాయని వీటి ప్రాముఖ్యతను కళాశాల విద్యార్థినిలకు వివరించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులు నీరు ఉండే బీకార్లో ఉపరితలంపైన గానుగ నూనె వేసి వాటితో దీపాలను వెలిగించడం జరిగింది అనంతరం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్ గారు మాట్లాడుతూ దీపావళి పండుగ హిందూ సంప్రదాయంలో భాగమని దీనిని పర్యావరణ అనుకూలమైన పదార్థాలతో తయారుచేసిన ప్రమిదలను ఉపయోగించి జరుపుకోవడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మరియు ఎకో క్లబ్ సభ్యులు డా. జె శ్రీదేవి , డా. కే సుధీర్, డా.ఐ.శ్రీవాణి డా.కే .శ్వేతారాణి ,డా. ఎస్ త్రివేణి , డా. బి మధుసూదన్ మరియు వివిధ తరగతుల విద్యార్థినిలు పాల్గొన్నారు.

మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు దీపావళి శుభాకాంక్షలు

వేడుకలు లబ్ధిదారుల వివరాలతో బ్యానర్ ఏర్పాటు చేయాలి

మంథని/మహాదేవపూర్, అక్షిత ప్రతినిధి: మండల కేంద్రం తోపాటు మండలంలోని పేద కుటుంబాల్లో ప్రజా ప్రభుత్వం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో లబ్ధిదారులైన ప్రతి పేద కుటుంబానికి గూడులు కల్పించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేయించి, గృహప్రవేశం చేసుకొన్న ప్రతి పేద లబ్ధిదారుని కుటుంబంలో దీపావళి కాంతుల వలె వారి వారి జీవితాల్లో వెలుగు నింపాలని కోరుతూ ప్రభుత్వం తోపాటు మహాదేవపూర్ సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ వారికి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ, ఇందిరమ్మ గృహప్రవేశం చేసిన లబ్ధిదారులు దీపావళి పండుగ జరుపుకునే వేళ, "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" పేరుతో, లబ్ధిదారుని పేరు ఇంటి సంఖ్య నంబర్ మంజూరు సంవత్సరం, ప్రభుత్వం అందించిన సబ్సిడీ రూపాలు గ్రామం మరియు మండలం జిల్లా, బ్యానర్ తమ ఇంటి వద్ద ఏర్పాటు చేసి దీపావళి, వేడుకలు చేసుకునే క్రమంలో ఒక ఫోటోలు సంబంధిత అధికారులకు లబ్ధిదారులు పంపించాలని సర్పంచ్ హసీనా అక్బర్ ఖాన్ విజ్ఞప్తి చేయడం జరిగింది.

అక్షిత అక్షర పోరు
ఆక్రమణలపై కదలిక!

మొదటి పేజీ తరువాయి...

అధికారులు ఎందుకు స్పందించడం లేదు? అనే ప్రశ్నలతో అధికార యంత్రాంగం బాధ్యతను గుర్తుచేసింది. తాజాగా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టడంతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

సర్వే నంబర్ 389లో 21 నిర్మాణాల గుర్తింపు!

ముత్తంగి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 389లో పొదలకుంటకు సంబంధించిన ప్రాంతంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సర్వేలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించిన 21 నిర్మాణాలను పరిశీలించారు. మండల సర్వేయర్ రవి వర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిలు, జేపీఓ యాదగిరి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తదితరులు సర్వేలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో కొలతలు చేపట్టి చెరువు హద్దులు, నిర్మాణాల పరిస్థితిని పరిశీలించి, ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లో జరిగిన నిర్మాణాలు వాస్తవమేనని అధికారికంగా నివేదికలు ఉన్నతాధికారులకు అధికారులకు పంపించారు.

ముందే నోటీసులు.. అయినా నిర్మాణాలపై ప్రశ్నలు!

ఈ వ్యవహారంలో మరో కీలకమైన అంశం ఉంది. ఇరిగేషన్ శాఖ ఉప విభాగం నంబర్ 5, పటాన్‌చెరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి 29-10-2026న లెటర్ నంబర్ ణజు/xాణ-5/ూజ/427 ద్వారా



సంబంధిత భూ యజమాని..పట్టాదారుకు నోటీసు జారీ చేశారు.పొదలకుంట ఎఫ్‌టీఎల్, బండ్ ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలు చేపడుతున్నట్లు శాఖ దృష్టికి వచ్చిందని నోటీసులో పేర్కొన్నారు. అనుమతులు లేని నిర్మాణాలను నిలిపివేయాలని, నిర్మాణ సామగ్రిని తొలగించి ఆక్రమిత ప్రాంతాన్ని ఖాళీ చేసి పూర్వస్థితికి తీసుకురావాలని ఆదేశించారు. భూ యాజమాన్య పత్రాలు, అనుమతులతో కూడిన వివరణను ఏడు రోజుల్లో సమర్పించాలని సూచించారు. ఆదేశాలను పాటించకపోతే చట్టప్రకారం తదుపరి చర్యలు చేపడతామని హెచ్చరించారు.

సర్వే పూర్తయింది.. ఇక చర్యలెప్పుడు?

ఇప్పటికే నోటీసులు జారీ కావడం, తాజాగా 21 నిర్మాణాలను అధికారులు గుర్తించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అయితే క్షేత్రస్థాయి సర్వే నిర్వహించడం ఒక్కటే చెరువుకు రక్షణ కల్పించినట్లు కాదు. సర్వే ఆధారంగా అధికారిక నివేదిక రూపొందించి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో జారీ చేసిన నోటీసులపై ఎలాంటి స్పందన వచ్చింది? సంబంధిత యజమానులు వివరణ సమర్పించారా? 21 నిర్మాణాలకు సంబంధించిన పూర్తి సర్వే నివేదిక సిద్ధమైందా? ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలపై తదుపరి చర్యలు ఏమిటి? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

పొదలకుంటా.. నీకు దిక్కెవరు?

వర్షపు నీటిని నిల్వ చేసే చెరువులు భవిష్యత్తు తరాలకు ఎంతో అవసరం. భూగర్భ జలాల పెంపు, వరద ముప్పు నివారణలో కీలక పాత్ర పోషించే ఇలాంటి జలవనరులు ఆక్రమణలకు గురైతే నష్టపోయేది ప్రజలే. అందుకే పొదలకుంట పరిరక్షణ విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది.అక్షిత కథనంతో అధికారులు క్షేత్రస్థాయి సర్వే వరకు వచ్చారు. 21 నిర్మాణాలను గుర్తించారు. మరి తదుపరి అడుగు ఎప్పుడు? సర్వే నివేదికలకే పరిమితం చేస్తారా? నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా? పొదలకుంటకు శాశ్వత రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. అక్షిత అక్షర పోరాటం కొనసాగుతుంది. పొదలకుంట పరిరక్షణే లక్ష్యం!

వైద్య,ఆరోగ్య సేవల్లో రాజీ ప్రసక్తే లేదు

తుంగతుర్తి దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.1000 కోట్లు తీసుకొస్తా

సూర్యాపేటలో రూ.190 కోట్లతో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

సూర్యాపేట, అక్షిత బ్యూరో : జిల్లాలో విద్య, వైద్య మౌలిక సదుపాయాలు పెంపొందించుటకు కృషి చేస్తానని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం అయన సూర్యాపేటలో రూ.190 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలన, రూ.1.17 కోట్ల అంచనా వ్యయంతో ఎస్బిఐ,ఐఓసీ,కోటక్ మహీంద్రా, అక్షర ఫౌండేషన్ ల సౌజన్యంతో కొనుగోలు చేసిన ఆధునిక వైద్య పరికరాలైన డీజన్ లైట్ వెంటిలేటర్లు,మైక్రోటోన్స్,కటరీ మెషిన్, బ్రోంకోస్కోప్, డెంటల్ చైర్, సీ-ఆర్మ్ తదితర పరికరాల ప్రారంభోత్సవంతో పాటు

కాంపెన్సేటరీ అపాయింట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా నియామక పత్రాలను ఆయన పంపిణీ చేశారు. తదుపరి ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రూ.190 కోట్ల వ్యయంతో 5 అంతస్తుల్లో వెయ్యి పడకల ఆసుపత్రి భవన నిర్మాణంను నాణ్యతతో



వేగంగా రెండు,మూడు నెలలలో పూర్తిచేసి ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో వైద్యం,విద్య మౌలిక సదుపాయాల పెంపొందించుటకు ప్రయత్నం చేస్తానని, హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల నేషనల్ హైవే ను 6 లైన్ ల రోడ్ గా మంజూరు చేయించి త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.దేవాదుల 6వ ప్యాకేజీ కింద తుంగతుర్తి నియోజక వర్గానికి రూ.1000 కోట్లను మంజూరు చేయించి నీటిని తీసుకొస్తామని చెప్పారు. పాత లిఫ్టులు,కొత్త లిఫ్టుల పునరుద్ధరణకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.జిల్లాలో ఇప్పటి వరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డు ఇప్పించడం జరిగిందని, అలాగే 80 శాతం మంది ప్రజలకు సన్న బియ్యం కూడా ఇస్తున్నామని అన్నారు. రాబోవు రోజుల్లో సూర్యాపేట జిల్లాను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచుతానని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు రఘువీర్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పీ నరసింహ, తెలంగాణ పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొర్రిశెట్టి నివేదిత లక్ష్మాధి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిజిహెచ్ సూపర్డెంట్ శ్రవణ్, వైద్య అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి గుట్ట వద్ద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన

జిల్లాలోని హుజుర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి అన్నారు.శుక్రవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని,ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్,గ్రీనరీ,త్రాగునీరు, పైలాన్ స్తూపం,సభాస్థలి పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, గ్రీనరీలో నాటిన మొక్కలకు నీరు అందించి మొక్కలు ఎండి పోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని,అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రఘువీర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్,ఎస్పీ కే నరసింహ,ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ జబ్బార్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గుత్తేదారులు,తదితరులు పాల్గొన్నారు.

తీర్థ యాత్రలకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు

పి వి. వెంకటేష్

దేశంలోని నాలుగు వైపులకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు

రైలు బస్సు హోటల్స్ భోజనాలు అల్పాహారం వాటర్ బాటిల్స్ ఉచితం

రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు రవాణా సౌకర్యం పూర్తి ఉచితం

భీమా సౌకర్యం

ఒక కోచ్ సెక్యూరిటీ గార్డ్ రైల్లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత

భక్తులు టూరిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



యాదాద్రి భువనగిరి అక్షిత న్యూస్ః దేశవ్యాప్తంగా తీర్థయాత్రలకు వెళ్లే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక భారత్ గౌరవం టూరిస్ట్ రైళ్లను అందుబాటులోకి తీసుకు వచ్చిందని అయ్యా సి టి సి టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి వి. వెంకటేష్ తెలిపారు. శుక్రవారం బోనగిరి రైల్వే స్టేషన్ విశ్రాంతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 27 వ తేదీ వరకు 4 ప్రత్యేక ప్యాకేజీలను భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు పి.వి. వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా యాత్రకి సంబందించిన వివరాలను ఆయనవెల్లడించారు.

1.సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (ఎస్సి జడ్ బి జి 68) ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), చత్రపతి సంభాజీనగర్ ((గ్రీష్ణేశర్) వరకు ఈ యాత్ర నవంబర్ 10వ తేదీన ప్రారంభమై 20 వ తేదీ వరకు ఉంటుందన్నారు. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు రూ.18,000,- 3 ఏసీ రూ. 27,400, 2 ఏసీ రూ.35,500 ఉంటుందన్నారు.ఈ యాత్ర సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్దేడ్ నాందేడ్, పూర్ణ మీదుగా వెళ్తుందని తెలిపారు

2. దివ్యదక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో (ఎస్ సి జెడ్ బిజి 69) (తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, చిదంబరం,త్రిచి, తంజావూరు) వరకు కొనసాగుతుందని, ఈ యాత్ర నవంబర్ 23న ప్రారంభమై డిసెంబర్ 1వ తేదీ వరకు ఉంటుంద న్నారు.దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు రూ.15,800,- 3 ఏసీ రూ.23,200,- 2 ఏసీ రూ.29,600- ఉంటుందని, ఈ యాత్ర సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై చర్లపల్లి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుందని తెలిపారు.

3. అయోధ్య-కాశీ: బైద్యనాథ్ ధామ్ దర్శన్ యాత్ర (ఎస్ సి జెడ్ బి జి 70) పూరి కోణార్క్-బైద్యనాథ్ ధామ్ - వారణాసి అయోధ్య ప్రయాగరాజ్ వరకు కొనసాగుతుందని, ఈ యాత్ర డిసెంబర్ 5న ప్రారంభమై 14 వ తేదీ వరకు ఉంటుందని, దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు రూ.17,000, -3 ఏసీ రూ.26,400, - 2 ఏసీ రూ.34,400- ఉంటుందన్నారు.ఈ యాత్ర సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై చర్లపల్లి, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని,దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా వెళ్తుందని వివరించారు.

4. సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (ఎస్ సి జెడ్ బి జి 71) ఉజ్జయిని (మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), చత్రపతి సంభాజీనగర్ ((గ్రీష్ణేశర్) వరకు కొనసాగుతుందని, ఈ యాత్ర డిసెంబర్ 17న ప్రారంభమై 27 వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెట్టు రూ.18,000, - 3 ఏసీ రూ.27,400, - 2 ఏసీ రూ.35,500 - ఉంటుందన్నారు.ఈ యాత్ర సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్దేడ్ నాందేడ్, పూర్ణ మీదుగా వెళ్తుందన్నారు.

యాత్రలో సౌకర్యాలు

రైలు, బస్సు, హటరీటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్ర భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలు, ప్రయాణ బీమా, అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితంగా ఉంటుందన్నారు. కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలు లో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030744, 92810 30734, 9281030727, 9281030759 లకు సంప్రదించాలని. మరిన్ని వివరాలకు ష్ణష్ణ.అతీష్ణిశీబతీఅంఎ.ఎశీఎ వెబ్సైట్ ని సంప్రదించాలని తేలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఆర్ సి టి సి టూరిజం మానిటర్స్ నరేష్ బాబు ఓర్సు, ప్రశాంత్ ,జయంత్, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి దేవాలయాలకు ధాతల భారీ విరాళాలు...

దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు



కోదాడ అక్షిత ప్రతినిధి: కూచిపూడి గ్రామంలో అంతరగంగా వాగు సమీపంలో శెట్టి వారి వంశస్థుల దైవభూమి నందు నిర్మాణంలో ఉన్న నూతన ఆలయాలు శ్రీ సీతారామాంజనేయ స్వామి,శ్రీ అభయాంజనేయ స్వామి,శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, షిర్డీ సాయి బాబ, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాల ప్రతిష్టా మహోత్సవాలకు ముస్తాభవుతున్నాయి. అందులో భాగంగానే దేవాయలయాలకు గ్రానైట్ ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కందికొండ సాయిబాబు మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి గ్రానైట్ దాతగా శ్రీ గుండం రాజేష్ రెడ్డి తండ్రి రమణారెడ్డి 10 టన్నులు, శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయానికి గంధం గోవిందరావు తండ్రి వీరయ్య 10 టన్నులు, షిర్డీ సాయిబాబ ఆలయానికి గ్రానైట్ దాతగా శ్రీ గంధం సుధీర్ నాయుడు తండ్రి వెంకటేశ్వర్లు10 టన్నులు,శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలకు గ్రానైట్ దాతగా శ్రీ శెట్టి బాబు తండ్రి బజారయ్య 10 టన్నులు, మొత్తంగ అందరూ కలిసి కూచిపూడి దేవాలయాలకు 40 టన్నుల గ్రానైట్ దాతలుగా ముందుకు రావడం అభినందనీయమని అదేవిధంగా ఈ గ్రానైట్ ట్రాన్స్ పోర్ట్ కోసం శ్రీ పద్మావతి ట్రాన్స్ పోర్ట్ అధినేత ఆకుల శేఖర్ లారీ ఏర్పాటు చేసి ఖమ్మం నుండి కూచిపూడి దేవాలయాలకు చేర్చినందుకు వారి కుటుంబాలకు ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ దేవాలయాల నిర్మాణ మహాయజ్ఞంలో దాతలు తమ వంతు సహాయ సహకారాలు విరాళాలుగా అందించి దైవకృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు, దాతలు గుండం రాజేష్ రెడ్డి,గంధం గోవిందరావు,గంధం సుధీర్ నాయుడు,శెట్టి నరేష్ నాయుడు, శెట్టి నర్సింహారావు, శెట్టి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి - ఉప్పల వెంకటేష్ అన్న ఆర్థిక సహాయం



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: కల్వకుర్తి నియోజకవర్గం, వెల్దండ మండలం, కుప్పగండ్ల గ్రామానికి చెందిన జిల్లెల్ల మేఘన తండ్రి శ్రీను యాదవ్ అమ్మాయి పెళ్లి పెట్టుకోవడం జరిగింది. ఆడబిడ్డ పెళ్లి అనేసరికి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న శ్రీను యాదవ్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ఉప్పల వెంకటేష్ ని సంప్రదించగా పేదింటి ఆడబిడ్డ వివాహానికి తన వంతుగా 20,000/- వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పెళ్లి ఖర్చులకు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్తల శేఖర్, హజిలాపూర్ సర్పంచ్ సిద్ధమోని రమేష్ గౌడ్,మాజీ ఎంపీటీసీ బాలకిష్టయ్య గౌడ్,బాలకృష్ణ, రామకృష్ణ, వెంకటయ్య గౌడ్,పారేష్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 1 కోటి చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: విధి నిర్వహణలో అకస్మాత్తుగా మృతిచెందిన ఆర్మ్డ్ రిజర్వు ఏ ఆర్ కానిస్టేబుల్ రాజు కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బిఐ అందించిన రూ. 1 కోటి విలువైన పోలీస్ శాలరీ ప్యాకేజ్ ఇన్సూరెన్స్ చెక్కును జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి పాటిల్,ఐపీఎస్ శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

గత ఆగస్టు నెలలో కొల్లాపూర్ సీఎం బందోబస్తు విధులు ముగించుకొని తిరిగి నాగర్ కర్నూల్ వస్తున్న క్రమంలో ఏఆర్ కానిస్టేబుల్ రాజు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పోలీస్ శాలరీ ప్యాకేజ్ ఖాతా ఉన్నందున, సంబంధిత బీమా నిబంధనల ప్రకారం బ్యాంకు యాజమాన్యం రూ. 1 కోటి పరిహారాన్ని మంజూరు చేసింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ

"బాధిత కుటుంబానికి కానిస్టేబుల్ రాజు లేని లోటు తీర్చలేనిది. ఇటువంటి క్లిష్ట సమయంలో రాజు కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని. ఈ క్లిష్ట సమయంలో ఎస్బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజ్ ద్వారా లభించిన ఈ పరిహారం వారి కుటుంబానికి ఆర్థికంగా కొంత ఆసరాగా నిలుస్తుందని,ప్రతి ఒక్క సిబ్బంది పోలీస్ శాలరీ ప్యాకేజ్ చేసుకోవాలని అదేవిధంగా హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో కృష్ణయ్య, ఆర్ఐ రాఘవరావు, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, జిల్లా పోలీస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మరియు మృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుడిపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి



పెద్ద అడిశర్లపల్లి, అక్షిత ప్రతినిధి: గుడిపల్లి మండలాన్ని ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్ర యాదగిరి డిమాండ్ చేశారు. అంగడిపేట ఎక్స్‌రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు కావాలనే కక్షపూరితంగా వ్యవహరించి గుడిపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. పక్కనే ఉన్న పెద్ద అడిశర్లపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, ఒకప్పుడు ఉమ్మడి మండలంగా ఉన్న గుడిపల్లిని విస్మరించడం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి గుడిపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ కోమెరా రాంబాబు, ఆదాసు రమేష్, బోడ నాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నుంచి యువత బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బొల్లం

యువత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



కోదాడ అక్షిత ప్రతినిధి: కోదాడ పట్టణ పరిధిలోని 18 వ వార్డు నందు గల యువత వినయ్, మీసాల నాని, రాము, సతీష్, వేణు, మణికంఠ, రాకేష్,పవన్, నవీన్ తో పాటు మరికొంతమంది వివిధ పార్టీలను వీడి బీఆర్ఎస్ పార్టీలో కోదాడ మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ స్థాయిలో విశ్వసనీయత కోల్పోయిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని వాటిని అమలు చేసిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, రైతులు, పేదలు, మహిళలు, యువతకు అండగా నిలిచిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు నిధులు నిలిచిపోయే పరిస్థితి ప్రస్తుతం నెలకొందని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, మల్లీ తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత ఉత్సాహంతో పాల్గొని బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుటకు కృషి చేయాలని కోరారు.

బషీరాబాద్ ఎస్సీ హాస్టల్ విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం

విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి..

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధులతో నూతన బోర్‌వెల్ పనులు ప్రారంభం..





తాండూరు అక్షిత ప్రతినిధి: బషీరాబాద్ మండల కేంద్రం లోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చొరవతో పరిష్కారం లభించనుంది. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధుల ద్వారా హాస్టల్ ఆవరణలో నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం నూతన బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు.

గత కొంతకాలంగా హాస్టల్‌లో తాగునీటి సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సంబంధిత వర్గాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాయి. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థులకు శాశ్వతంగా తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో వెంటనే నిధులు సమకూర్చి బోర్‌వెల్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది.

విద్యార్థుల కనీస అవసరాలను గుర్తించి, వారి ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే చూపిన చొరవపై హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయిస్తున్నందుకు, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ఎమ్మెల్యే హాస్టల్‌లోని విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి, ప్రభుత్వం తరఫున కల్పిస్తున్న వసతులు, భోజన సదుపాయాలు, తాగు నీటి సౌకర్యం తదితర అంశాల పై ఆరా తీశారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలు ఉన్నాయా? ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందు తున్నాయా? అనే విషయా లను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడం ఎంతో ముఖ్యమని, వారి అవస రాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, బోర్‌వెల్ పనులు ప్రారంభించడం పట్ల విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

ఆత్మగౌరవ భవనాలపై పెత్తనం ఎందుకు?



వరంగల్, అక్షిత బ్యూరో : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి నిర్వహణకి విడుదల చేసిన జీవో.నెంబర్.14 ని ఉపసంహరించుకోవాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. సుబేదారిలో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం 2018లో వివిధ బీసీ కులాలకి 41 ఆత్మగౌరవ భవనాలను నిర్మించడానికి కోకాపేట, ఉప్పల్ భగాయత్ లో 87 ఎకరాల భూమిని కేటాయిస్తూ జీవో.నెంబర్.189 ని విడుదల చేసింది.వివిధ కారణాల వలన పూర్తికాని 38 బీసీ ఆత్మగౌరవ భవనాలను పూర్తి చేయటానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీవో.నెంబర్.14 ని విడుదల చేస్తూ 88 కోట్ల రూపాయలను కేటాయించింది కానీ ప్రభుత్వం నిర్మిస్తున్న బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్వహణను కూడా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవటాన్ని ఆయా కుల సంఘాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఆత్మగౌరవ భవనాల నిర్వహణ బాధ్యతను కూడా ఆయా గుర్తింపు పొందిన సంఘాల కమిటీకే అప్పగించాలని డిమాండ్ చేసినారు.

అన్ని జిల్లా కేంద్రాలలో 50 కోట్ల రూపాయలతో ప్రొఫెసర్ జయశంకర్ బీసీ ఐక్యతా భవనాలను నిర్మిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేసినారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఆత్మగౌరవ భవనాల నిర్మాణమే కాదు బీసీ విద్యార్థిలకి పూర్తి ఫీజు రియంబర్స్మెంట్ కూడా చెల్లించాలని డిమాండ్ చేసినారు.

ఈ ర్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ బుర్ర శ్రీధర్ డాక్టర్ నరేందర్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన విఠల్ రెడ్డి

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా వివాహ వార్షికోత్సవ వేడుకలు..



తాండూరు అక్షిత ప్రతినిధి: తాండూరు మండలం చెంగోల్ గ్రామ మాజీ సర్పంచ్ మల్లేశ్వరి గౌడ్ కుమార్తె వివాహ వార్షి కోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖుల మధ్య వేడుకలు ఆనందోత్సాహాల నడుమ జరిగాయి. ఈ వేడు కలకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి ప్రత్యేకంగా హాజరై దంపతులకు వివాహ వార్షి కోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా విఠల్ రెడ్డి దంపతులను ఆత్మీయంగా పలకరించి, వారి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం దంపతుల వైవాహిక జీవితం ప్రేమానురాగాలు, పరస్పర అవగాహన, సుఖసంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో వారు మరెన్నో వివాహ వార్షికోత్సవాలు ఆనందంగా జరుపుకోవాలని, ఆయురారోగ్యాలు, అష్టై శ్వర్యాలతో కుటుంబ జీవితం సంతోషంగా సాగాలని, మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పంజుగుల శ్రీశైల్ రెడ్డి పాల్గొని దంపతులకు శుభా కాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిపూర్ నరసింహులు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుగౌడ్, మధు గౌడ్, బబ్లూ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని, దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో సాగడంతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచాలి

జిల్లాల్లో అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులకు దిశానిర్దేశం

అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి, వీబీ–జీ రామ్ జీ (ఎబీ–+ =ూవీ +), తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైల్వే, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై జిల్లాలవారీగా సమీక్షలోఅదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ..... నాగర్ కర్నూల్ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సరఫరాకు చేపడుతున్న ముందస్తు చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, బులేట్ రైల్వే, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పనులు, భూసేకరణ ప్రక్రియ తదితర అంశాల వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ..... సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, బ్రేక్‌ఫాస్ట్, యూనిఫామ్‌ల పంపిణీ, పాఠశాల భవనాల నిర్మాణాలు, వివిధ అభివృద్ధి పనులు, కేటాయించిన నిధుల వినియోగంపై సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాబోయే కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జిల్లాల అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను అంచనా వేసి, నీటి ట్యాంకులు, బోర్లు, ఇతర నీటి వనరులను పరిశీలించాలని ఆదేశించారు. మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే రిపేర్ చేయడంతో పాటు, తాగునీటి సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు వీబీ–జీ రామ్ జీ పథకం కింద ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి, కూలీలకు అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, పనుల అమలులో సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకునేలా అవసరమైన సహకారం అందించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. నిర్మాణ దశలవారీగా పురోగతిని పర్యవేక్షిస్తూ, లబ్ధిదారులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

అదేవిధంగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో వారి సొంత ఇళ్లలో దీపావళి పండుగ వేడుకలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరేలా నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

జిల్లాల్లో కొనసాగుతున్న రైల్వే, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇతర అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారుల ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

పాలకులు సిగ్గుపడాలి

సాధించుకున్న తెలంగాణాలో ఇంకా ఆత్మహత్యలు

హామీలు మరచి ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య

ఖమ్మం /అక్షిత బ్యూరో : కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఇంకా ఆత్మ బలిదానాలు ఆగడం లేదంటే పాలకులు సిగ్గుపడాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య అన్నారు. ఇటీవల జనగామా జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు పీఏసీఎస్ డైరెక్టర్ వేముల లక్ష్మణ్ గౌడ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడం తమను కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధిత కుటుంబాన్ని పలువురు ఉద్యమకారులతో వెళ్లి పరామర్శించారు. అనంతరం బత్తుల సోమయ్య మాట్లాడుతూ విద్యార్థులు మేధావులు సామాన్యులు సైతం ప్రత్యేక తెలంగాణ కోసం అనేక త్యాగాలు చేశారని మన నీళ్లు మన నిధులు, మన నియామకాలు మనకే దక్కాలనే ఏకైక లక్ష్యంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే ఆ ఫలాలు కొద్ది మందే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంకోసం సర్వం కోల్పోయిన అనేకులు పన్నెండేళ్ల పాటు ఎదురు చూసినప్పటికీ ఎలాంటి ఫలితంలేకపోవడంతో నిరాశ చెంది చేసిన అప్పులు తీర్చుకోలేక ఇలా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని సోమయ్య అన్నారు. గత పాలకులకు గానీ నేటి పాలకులకు గానీ చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లక్ష్మణ్ గౌడ్ కు ఘన నివాళి :

ఆత్మహత్య కు పాల్పడిన లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి ఎంమ్మెల్సీ కోదండరాం, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తో కలసి బత్తుల సోమయ్య, తెలంగాణ ఉద్యమకారులు పూలమాలలు



వేసి నివాళులు అర్పించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం :

వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించెందుకు ఖమ్మం జిల్లా నుంచి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. రానున్నారోజుల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో టీ యు జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఓరుగంటి ఆనంద్, రాష్ట్ర ప్రధాన కారదర్శి కొణతం యాదగిరి రెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు కుక్క సత్యం, అంగిడి బిక్షం, తునికిపాటి లక్ష్మణ చారి, బొలికొండ పాపయ్య, పొలాస సోమయ్య, గడ్డం యాదగిరి, వడ్త్యా రాజేష్ నాయక్, కాశబోయన యాకయ్య, గుగులోత్ మంగీలాల్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

ప్రైవేట్ పాఠశాలల ఉపా ధ్యాయులతో సమావేశం..

అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు అయ్యేలా కృషి చేయాలని పిలుపు..



తాండూరు అక్షిత ప్రతినిధి: త్వరలో జరగనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం తాండూరు పట్టణం లోని తులసీ గార్డెన్స్‌లో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా ఉపా ధ్యాయులు చొరవ చూపాలని, సూచించారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, కోరారు. ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి, అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్స హించాలని, అన్నారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని, ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డికి అభినందనలు,శుభాకాంక్షల వెల్లువ..

మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, ఆల్విన్ కాలనీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ మర్యాదపూర్వక భేటీ..



శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి) అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి పారిజాత నరసింహారెడ్డి ని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ , ఆల్విన్ కాలనీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ తో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డి ని సంప్రదాయబద్ధంగా శాలువాలతో ఘనంగా సత్కరించి, మొక్కను అందజేసి తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు.

అనంతరం నాయకులు మాట్లాడుతూ, ఆమె సమర్థవంతమైన నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి ఆమె అందించే నాయకత్వం మరిన్ని విజయాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ సీనియర్ నాయకులు బాష్పాక యాదగిరి , బాబ్జి, సాయి లోహిత్, శశి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.కొత్త బాధ్యతల్లో పారిజాత నరసింహారెడ్డి మరిన్ని విజయాలు సాధిస్తూ, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి విశేష కృషి చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

హుజూర్‌నగర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద అస్తవ్యస్తంగా ఆర్ అండ్ బి రోడ్డు

రోడ్డు దుస్థితితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

టూవీలర్, ఆటోలు, కార్లు నడిపేందుకు భయపడుతున్న ప్రయాణికులు

అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్



కోదాడ అక్షిత ప్రతినిధి: హుజూర్‌నగర్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు, అధ్వానంగా ఉన్న రహదారి కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో రోడ్డు పరిస్థితి ఇలా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పరిస్థితిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు మేల్కొని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్షిత్ రెడ్డి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



కరీంనగర్ అక్షిత బ్యూరో: క్రీడల ద్వారా విద్యార్థులకు అనేక లాభాలు జరుగుతాయని మరియు ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలో అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక రకమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని మరియు పోటీలను సైతం నిర్వహించడం జరుగుతుందని వారు నా ద్వారా పట్టు వస్తుందని మరియు ఆసక్తి పెరుగుతుందని వారు చెప్పారు. ఈ క్రమంలో డి. అక్షిత్ రెడ్డి, ఎస్ జి ఎఫ్ వాలీబాల్ చాంపియన్షిప్ అండర్ -17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనడని చెప్పారు అని చెప్పారు. విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి జాతీయ స్థాయి పోటీలలోను అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఉత్తమంగా ఉండాలని వారు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలలోను అద్భుతమైన ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల్లోనూ అద్భుతమైన ప్రతిభ దాగిఉంది

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి సరైన ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ అందిస్తే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దీటుగా అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న పయనీర్ కార్యక్రమం ద్వారా ప్రతి యేడాది వంద మంది విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించి, వైద్య, ఇంజినీరింగ్‌తో పాటు పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశాలు పొందడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పయనీర్ కార్యక్రమం ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి సంవత్సరం వంద మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే స్థాయికి చేరుకోవడం పయనీర్ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన వాగ్దేవి, ప్రతిభ, ఋషి జూనియర్ కళాశాలల యాజమాన్యాలకు, ప్రిన్సిపాళ్లకు, అధ్యాపకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కళాశాలల అధ్యాపకులను కేటాయించి, నెలల తరబడి ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ అందించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన అధ్యాపకులకు, చదువుకున్న కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ విజయాలను, సర్టిఫికెట్లను, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లతో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ఇవి భవిష్యత్తులో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని చెప్పారు. ప్రతి కుటుంబంలోని బిడ్డ ఉన్నత విద్యను అభ్యసించి, స్వశక్తితో నిలబడి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నదే తమ లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు దాతలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పయనీర్ ప్రత్యేక శిక్షణ ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డీఐఈఓ శ్రీమతి చిలుక రమణి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అలీముద్దీన్, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ విజేత వెంకట్ రెడ్డి, ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, రిషి జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, కార్పొరేటర్లు అనుప ఆంజనేయులు, ప్రశాంత్ , సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల నాగరాజు, , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు సిరిగిరి మురళి, నాయకులు మైత్రి యాదయ్య , తుప్పలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఇచ్చిన హామీ నెరవేర్చాలి

పెరికేడు గ్రామ దళితులకు ఇండ్లు మంజూరు చేయాలి

బీఆర్ఎస్ గ్రామశాఖ డిమాండ్

రాయపర్తి అక్షిత ప్రతినిధి: మండలంలోని పెరికేడు గ్రామంలో దళిత కుటుంబాలకు గతంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 40 ఇళ్లను తక్షణమే మంజూరు చేయాలని బీఆర్ఎస్ గ్రామశాఖ నాయకులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో పెరికేడు గ్రామానికి 40 ఇళ్ల మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఒక్క ఇంటి పని కూడా ప్రారంభం కాలేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా గ్రామంలోని సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ నాయకులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తున్నారా? లేదా ఎమ్మెల్యే స్పందించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం రెండో విడతలో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన నిరుపేదలకు, గత ప్రభుత్వంలో ఇండ్లు ప్రారంభించి మధ్యలో నిర్మాణం నిలిచిపోయిన దళిత కుటుంబాలకు వెంటనే ఇళ్లు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దళితులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఎన్నికల హామీలను నెరవేర్చని సర్పంచ్

పెరికేడు గ్రామంలో వీధికుక్కలు, కోతుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన గ్రామ సర్పంచ్ ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వీధి కుక్కలు, కోతులు చిన్నపిల్లలు వృద్ధులు గ్రామస్తులపై దాడి చేసిన సంఘటనలు గ్రామంలో పలుమార్లు చోటుచేసుకున్నప్పటికి గ్రామ సర్పంచ్ పట్టించుకోకపోవడం శోచనీయమని, గ్రామంలో కోతులు కుక్కల సమస్యలను పరిష్కరించడం తమవల్ల కాదని చెబితే బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ తరపున సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ కంటెస్టెడ్ అభ్యర్థి బండి రాజబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మర వీరస్వామి నాయకులు చిన్నాల రాజబాబు భాష బోయిన సుధాకర్ మంగి శెట్టి రాజు అంజద్ పాష మల్లంపల్లి యాకయ్య గొడుగు యాకయ్య పుట్ట అశోక్ రవి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తిని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మందుల సామేలు

తిరుమలగిరిలో రూ.5.30 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

నూతన ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసిన శాసనసభ్యులు

పదో తరగతి, ఇంటర్ టాపర్లకు రూ.50,000 నగదు బహుమతి ప్రకటన

పాలిటెక్నిక్ కాలేజీలో 200 మంది విద్యార్థులకు సరిపడా వసతి గృహ సదుపాయం



తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి: తుంగతుర్తి నియోజకవర్గాన్ని గుడిసెలు లేని ఇల్లుగా మార్చడమే తన ధ్యేయమని, ఉద్యమ పౌరుడిగా తాను చేసే ప్రతి పని నియోజకవర్గ ప్రజలందరికీ ఉపయోగపడేలా చేస్తానని స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) మందుల సామేలు స్పష్టం చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో విద్యాశాఖ నిధులు రూ.5.30 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ భూమి పూజ (శంకుస్థాపన) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం 5వ వార్డు యందు భూతం పద్మ భర్త రాంబాబు, 6వ వార్డు యందు ముసురం సోమక్క భర్త సత్తయ్యల నూతన ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే మందుల సామేలు స్వయంగా ముగ్గు పోసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా ప్రతినిధుల, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కీలక ప్రకటనలు చేశారు.

ముఖ్యమంత్రితో కొట్లాడి కాలేజీ సాధించాను:

ఎన్నో కష్టాలకు ఓర్చి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారితో కొట్లాడి తిరుమలగిరి దశాబ్దాల కల అయిన ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంజూరు చేయించానని ఎమ్మెల్యే మందుల సామేలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఇకపై పదవ తరగతిలో కూడా టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు రూ.50,000 నగదు బహుమతిని సొంతంగా ప్రకటిస్తున్నట్లు హామీ ఇచ్చారు. స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో ప్రస్తుతం 100 మంది పిల్లలకే వసతి గృహం (హాస్టల్) సదుపాయం ఉందని, అది సరిపోనందున మొత్తం 200 మంది పిల్లలకు సరిపడా వసతి సదుపాయాన్ని కల్పిస్తానని మాట ఇచ్చారు. కళాశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

గుడిసెలు లేని నియోజకవర్గంగా తుంగతుర్తి:

నియోజకవర్గంలో నివసిస్తున్న సంచార జీవులు, పేద ప్రజలందరినీ గుర్తించి అందరికీ ఇందిరమ్మ ఇళ్లను సాంక్షన్ చేయిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మైలాపురం, మాదిపురం (మాలిపురం) పరిధిలోని జంగాల గుడిసెలతో పాటు నియోజకవర్గంలోని ప్రతి గుడిసె స్థానంలో పక్కా ఇందిరమ్మ ఇల్లు నిర్మించేలా నిరంతరం ప్రయత్నించి, తుంగతుర్తిని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.5 లక్షల రూపాయలు అందిస్తోందని గుర్తుచేశారు.

తొండ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ స్కూలు, అలాగే ఈరోజు శంకుస్థాపన చేసిన జూనియర్ కాలేజీ భవన నిర్మాణాలు పూర్తి



కాగానే.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేకంగా తీసుకొచ్చి వారి చేతుల మీదుగానే వీటిని ప్రారంభింపజేస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రకటించారు.

రైతాంగానికి అండగా దేవాదుల ప్రాజెక్ట్:

వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గంలోని 8 గ్రామాలకు చెందిన 13,000 ఎకరాలకు, అలాగే రాయగారి కాలువ ద్వారా సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు పక్కా ప్రణాళికలు సిద్ధం చేశారని, గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని కోట్ల అప్పుల్లో ముంచినారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరి జనార్దన్, సర్పంచ్‌లు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావతు జుమ్మిలాల్ నాయక్, పట్టణ అధ్యక్షులు కేసిడి వెంకట లక్ష్మారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎల్సోజు నరేష్, మాజీ పట్టణ అధ్యక్షులు పేరాల విరేష్, కౌన్సిలర్లు తిరుమణి యాదగిరి, కిసిడి కవిత వెంకటరెడ్డి, బత్తుల శ్రీనివాస్, అంజయ్య, మల్లన్న, సర్పంచులు ధరావతు రామోజీ, చిరంజీవి, లక్ష్మణ్ నాయక్, రాజశేఖర్, బిచ్చు నాయక్, కిషన్, సతీష్ గౌడ్, బాలాజీ, వార్డు ఇన్చార్జిలు జంపాల భిక్షం, కందుకూరి లక్ష్మయ్య, ఉప్పలయ్య, వీరు నాయక్, పత్తి పురం సుధాకర్, మూల రాజు , సీనియర్ నాయకులు దుప్పటి మల్లయ్య, సుదర్శన్, నాయిని కృష్ణ, మోహన్, భాస్కర్, శ్రీనివాస్, కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మరియు అధ్యాపక బృందం, ఇరిగేషన్, ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

ఎంపీ చామల సహకారంతో కడవెరుగు గ్రామానికి ఎల్ఈడీ లైట్లు

చేర్యాల అక్షిత ప్రతినిధి: చేర్యాల మండలంలోని కడవేరుగు గ్రామంలో వీధి దీపాల సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఇందులో భాగంగా శుక్రవారం కడవేరుగు గ్రామపంచాయతీకి 30 వాట్ల సామర్థ్యం కలిగిన 33 ఎల్ఈడీ లైట్లను గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్త ఆధ్వర్యంలో అందజేశారు. గ్రామంలో విద్యుత్ వెలుగులు మరింత విస్తరించేందుకు సహకరించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఖమ్మం వరంగల్ నలగొండ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎలక్షన్లు రాబోతున్న



సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి అర్హులైన పట్టబద్రుల యువకులకు ఓటర్ నమోదు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్త, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బాల చంద్రము, యూత్ అధ్యక్షులు నీరటి విజయ్, నాయకులు కోమనేని భూమయ్య, పోగుల శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం నూతన యాదవ సంఘం ఎన్నికలలో గెలిచిన కార్యవర్గంకి ఘన సన్మానం..

బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో వేడుక..



శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి: రాయదర్గం యాదవ సంఘం ఎన్నికలలో గెలిచిన యాదవ సంఘం అధ్యక్షులు అప్పల యాదవ్. యువజన విభాగం అధ్యక్షులు దానబోయిన రాజు యాదవ్ , కమిటీ సభ్యులకు అందరికీ ఘనంగా సన్మానించిన బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరీ రామచంద్ర యాదవ్, తెలంగాణ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఒంగోరూ శ్రీనివాస్ యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర యువజన విభాగం నాయకులు అందేలా కుమార్ యాదవ్, పెద్ద ఎత్తున యాదవ బంధుమిత్రులు పాల్గొని నూతనంగా ఎన్నుకున్న అధ్యక్ష కార్యదర్శులకు, అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో విజేతలందరికీ ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ యాదవ్ సంఘం ప్రతినిత్యం రాయదుర్గంలోని యాదవ బంధువులకు సేవలు అందిస్తూ మరియు రాయదుర్గం గ్రామ ప్రజలకు కూడా ఏ అవసరం ఉన్న సంఘం ముందు ఉండి పని చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలియజేశారు.యాదవులు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ముందుకు ఎదగాలని వారు యాదవుల సంఘం సభ్యులందరికీ సూచన చేసినారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా సమాజంలో మన వంతు సేవగా రాజకీయంగా ఎదిగినప్పుడే మన యాదవ జాతికి మేలు జరుగుతుందని అన్నారు ఐక్యమత్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి ఐక్యమత్యం మహాబలం సంఘం సంఘటితంగా ఉన్నప్పుడే సమాజం బాగుపడుతుంది. సంఘం ఎంత పటిష్టంగా ఉంటుందో సంఘటిత పోరాటం కూడా అంతే గట్టిగా ఉంటుంది. సంఘం సంఘం తరఫున కాకుండా ప్రజల తరఫున పోరాడేలా ఉండాలి. యాదవ ప్రజల హక్కులను కాపాడేలా ఉండాలి. గెలిచిన వారందరూ కూడా యాదవ సమాజం కోసం పనిచేస్తారని ఆశిస్తున్నాము అని తెలిపారు.

మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి : కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన కల్వకుర్తి మండలంలోని గుండూర్ గ్రామానికి చెందిన వంగూరి విమలమ్మ అనారోగ్యంతో మరణించారు ఈ విషయాన్ని గ్రామ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు సర్పంచి అయిననేని లక్ష్మమ్మ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఢ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న మృతురాలు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ సూర్యప్రకాష్ రావు బిఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య ,నాగేంద్రం, వార్డు సభ్యులు రాజేందర్,బండి లక్ష్మయ్య, వడ్డే శివ,సైదులు,గిరి తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ చేసిన సర్పంచ్ పెంటమ్మ



చిన్నంబావి, అక్షిత న్యూస్: చిన్నంబావి మండలం లక్ష్మిపల్లి గ్రామంలో డ్రై డే కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ఇటిక్యాల పెంటమ్మ ఆధ్వర్యంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న రాగి జావ పంపిణీని, దాని నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందేలా చూడాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రామస్వామి, ఉపసర్పంచ్ మురళి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలకులు, అధికారులు పట్టించుకొని అడ ప్రాజెక్ట్ ..

టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సిద్దం సెట్టి సాజన్



ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి: వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కట్టిన కుమరం భీమ్ (అడ) ప్రాజెక్ట్ ఈ ప్రాంత పాలకులు,అధికారులు నిర్లక్ష్య కారణంగా మరమ్మత్తు కు నోచుకోవడం లేదని టీ ఆర్ ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సిద్దంసెట్టి సాజన్ ఆరోపించారు.పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అదేశాల మేరకు తన టీంతో శుక్రవారం హైదరాబాద్ నుండి వచ్చి ప్రాజెక్ట్ పరిస్థితినీ జిల్లా నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు 45000 ఎకరాలకు నీరందించడానికి రూపాయలు 870 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ 2022 సంవత్సరంలో వచ్చిన భారీ వచ్చిన భారీ వర్షాలకు దెబ్బ తిన్నది అప్పటి నుండి ఇప్పటి వరకు దాని మరమత్తులు చేపట్టలేదని పైగా ప్రజల దృష్టి మళ్లించడానికి టార్ బాల్ కప్పి పెట్టారని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా ప్రాజెక్ట్ కాల్వలకు పిల్ల కాల్వలు నిర్మించలేదని అన్నారు.ఎల్లినో ప్రభావంతో ప్రజలు,రైతులు భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి ఎదురుకొనే పరిస్థితి నెలకొంటే పాలకులు, అధికారులు, నిమ్మకునీరెత్తనట్టు ఉండడం ఇక్కడి ప్రజల దురదృష్టమని అన్నారు. పాలకులు,అధికారులు వెంటనే స్పందించి పరమత్తులు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడి పరిస్థితి పై పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అక్క దృష్టికి తీసుకొని వెళ్లనునట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కుమరంభిం ఆసిఫాబాద్ పార్టీ జిల్లా అధ్యక్షులు కిర్మిళ్ల వినోద్ చారి,ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ మహిళ్కర్,ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షులు కొట్నక కిషన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు,జాయింట్ సెక్రటరీ పెందూర్ ధర్మ్ము,మంచిర్యాల జిల్లా యువజన యువజన, నాయకులు హరీష్,స్వరాజ్, ఆసిఫాబాద్ జిల్లా నాయకులు తిరుపతి,షేక్ అదిల్,పెంటన్న, ఉప్పరి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

యువతలోని ప్రతిభను వెలికితీయాలి

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ అక్షిత బ్యూరో: యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు.శుక్రవారం, స్థానిక మెదక్ స్టేడియంలో అట్టహాసంగా జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఉత్సవాల్లో యువత పెద్ద సంఖ్యలో



పాల్గొనేలా విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామీణ , పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు.యువజన ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, పాటలు, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు, తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని తెలిపారు.

యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్సాహంగా పాల్గొనాలని అధికారులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పీడీలు, పీఈటీలు , క్రీడాకారులు పాల్గొన్నారు.

వెల్జాల్ గ్రామంలో ముందస్తుగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

జన్మదిన సందర్భంగా ప్రైమరీ స్కూల్‌కు ఫ్యాన్లను బహుకరించిన కాంగ్రెస్ నాయకులు



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: తలకొండపల్లి మండలం,వెల్జాల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా వెల్జాల్ కాంగ్రెస్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఆదివారం 8 తేదీ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా వెల్జాల్ ఎమ్పివిస్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రధానోపాధ్యాయురాలు లావణ్య కి ఫ్యాన్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేయడం జరిగింది విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు అందజేయడం జరిగింది.విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే మంచి సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి చదువుకు చిన్నపాటి సహాయం అందించడం ఎంతో సంతోషకరమైన విషయం. సేవా కార్యక్రమాలే నిజమైన జన్మదిన వేడుకలకు నిదర్శనం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డకి ముందస్తుగా వెల్జాల్ కాంగ్రెస్ కమిటీ తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి మాజీ ఎంపీటీసీలు జి,శ్రీనివాసమూర్తి,ఎం.అంబాజీ ,మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ,అంజయ్య గౌడ్,మాజీ ఉపసర్పంచ్లుబి,నర్సింలు,అజీజ్ నాయకులు అశోక్ బాబు,టి కృష్ణయ్య గౌడ్,ఎం.డి.ఆరిఫ్, వద్దే రాజు పులిజాల విష్ణు బి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో న్యాయ అవగాహన కార్యక్రమం

చట్టాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం

జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమం



నర్సాపూర్,అక్షితన్యూస్: జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ ఎంఈఓ తారా సింగ్, లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్ రాజు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు, బాలలపై జరిగే వేధింపులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాల వంటి సమస్యలపై యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మహిళల రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, బాలల హక్కులు, సైబర్ నేరాల నివారణ, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అన్యాయానికి గురైనప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించి చట్టబద్ధంగా న్యాయం పొందాలని సూచించారు.

ఆర్థిక స్థోమత లేని కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థలు అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నాయని వివరించారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సమాజంలోని ఇతరులకు కూడా న్యాయ విజ్ఞానాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, బి. శేఖర్, కె.ఆర్. శ్రీనివాస్ గౌడ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.